# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 17-10-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- భారత్‌లో ప్రపంచ వ్యాప్తంగా పోటీపడగల వాణిజ్య అంతరిక్ష సంస్థల నిర్మాణం జరగాలని కేంద్రమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు.

- 14 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాలలో ఓటర్ల జాబితాల ప్రత్యేక సారాంశ సవరణ (SSR)ను చేపట్టాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది.

- `ఆత్మనిర్భర భారత్` సాకారం కోసం పౌరులందరి సమిష్టి నిబద్ధత అవసరమని కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయ వ్యాఖ్యానించారు.

- బెంగళూరు వేదికగా భారత్ - వెస్టిండీస్ జట్ల మధ్య జరగాల్సిన ఐదో టీ-20 క్రికెట్ మ్యాచ్ వర్షం కారణంగా ఆలస్యమైంది.

=====================

భారతదేశ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ.. రానున్న 7-8 సంవత్సరాల్లో 40 నుంచి 45 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్టు అంతరిక్ష శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. అంతరిక్షం, సార్వభౌమత్వం, నూతన ఆర్థిక వ్యవస్థ అనే అంశంపై న్యూఢిల్లీలో ఈరోజు నిర్వహించిన బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీ ఫోరం మీడియా రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. భారతీయ సంస్థల అభివృద్ధికి, ప్రపంచ మార్కెట్లలో వాటి విస్తరణకు దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడులు ఆవశ్యకమని పేర్కొన్నారు. అలాగే.. వేగవంతమైన నియంత్రణ ఆమోదాలు, సుస్థిర వ్యాపార నమూనాలు కూడా అవసరమని చెప్పారు. భారత్ ఇప్పుడు తన సాంకేతిక సామర్థ్యాలను ప్రదర్శించడం నుంచి ముందుకు వెళ్లి, ప్రపంచ వ్యాప్తంగా పోటీపడగల వాణిజ్య అంతరిక్ష సంస్థలను నిర్మించాలని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. స్వదేశీ సామర్థ్యాలను బలోపేతం చేస్తూనే.. మూలధనం, భాగస్వామ్యాల కోసం భారత్ అవకాశాలను కల్పిస్తోందని జితేంద్ర సింగ్ పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

=====================

ఓటర్ల జాబితాల ప్రత్యేక సారాంశ సవరణ (SSR) ను 14 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాలలో చేపట్టాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. అండమాన్, నికోబార్ దీవులు, అస్సాం, బీహార్, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళం, లక్షద్వీప్, మధ్యప్రదేశ్, మణిపూర్, పుదుచ్చేరి, పంజాబ్, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో వచ్చే సంవత్సరం జనవరి 1వ తేదీ నాటికి SSR పూర్తి చేయాలని సూచించింది. ముసాయిదా ఓటర్ల జాబితాలు ఈ ఏడాది నవంబర్ 12న విడుదలవుతాయని, తుది ఓటర్ల జాబితాల ప్రచురణ వచ్చే ఏడాది జనవరి 4న జరుగుతుందని పేర్కొంది. అర్హత కలిగిన పౌరులు వచ్చే నెల 12 నుండి డిసెంబర్ 11 వరకు తమ అభ్యంతరాలను లేదా క్లెయిమ్‌లను సమర్పించవచ్చని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

=====================

దేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని, `వికసిత్ భారత్ 2047` దార్శనికతకు సహకరించాలని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ పిలుపునిచ్చారు. గుజరాత్‌లోని పోర్‌బందర్ జిల్లా, కుటియానాలో ఈరోజు జరిగిన `వికసిత్ భారత్ యువ సంవాద్` కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. మాదకద్రవ్య రహిత భారతదేశ నిర్మాణంలో యువ నాయకత్వం, దేశభక్తి, పౌర బాధ్యతలు, సామూహిక కార్యాచరణ కీలకమన్నారు. అభివృద్ధి చెందిన, ఆత్మనిర్భర భారతదేశ సాకారం కోసం పౌరులందరి సమిష్టి నిబద్ధత అవసరమని చెప్పారు. యువత జాతీయ, ప్రపంచ పరిణామాలపై అవగాహన కలిగి ఉండి, దేశ ప్రగతికి దోహదపడాలని కోరారు. దేశ యువత.. క్రమశిక్షణ, సేవ, అంకితభావం, ఆత్మవిశ్వాసాలను పెంపొందించుకోవాలన్న ఆయన.. దేశ నిర్మాణానికి వ్యక్తులు అధికార పదవులలో ఉండవలసిన అవసరం లేదని వ్యాఖ్యానించారు.

=====================

IDBI బ్యాంకులో ప్రభుత్వ వాటా తగ్గకుండా పరిమితులు విధించాలని కోరుతూ ప్రవేశపెట్టిన సవరణను తిరస్కరించడం జరిగిందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. IDBIలో ప్రభుత్వ వాటాకు సంబంధించి 2003లో జరిగిన శాసనపరమైన పరిణామాలకు సంబంధించి, పలు పత్రికలు కథనాలను ప్రచురించిన నేపథ్యంలో ప్రభుత్వం ఈరోజు దీనిపై వివరణ ఇచ్చింది. ఈ అంశాన్ని తదనంతరం పరిశీలించిన ఢిల్లీ హైకోర్టు 2018 డిసెంబర్ 17 నాటి తీర్పులో, IDBI బ్యాంకులో ప్రభుత్వ వాటాను తగ్గించే ప్రభుత్వ అధికారాన్ని పరిమితం చేయడానికి, పార్లమెంటరీ చర్చల సందర్భంగా చేసిన ప్రకటనల ఆధారంగా ప్రామిసరీ ఎస్టోపెల్ సిద్ధాంతాన్ని వర్తింపజేయలేమని స్పష్టం చేసిందని పేర్కొంది. IDBI బ్యాంకులో ప్రభుత్వ వాటాను తగ్గించడాన్ని నిషేధించే నిబంధనలేవీ ఆ చట్టంలో లేవని కూడా కోర్టు తెలిపిందని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

విరామం

=====================

కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్, ఢిల్లీ - ఎన్‌సిఆర్ లో వాయు కాలుష్య నివారణపై పనిచేస్తున్న అంకుర సంస్థలతో ఈరోజు సమావేశమయ్యారు. `సాఫ్ హవా మే హిస్సేదారీ, హమ్ సభీ కీ హై జిమ్మేదారీ` ప్రచారంలో భాగంగా జరిగిన ఈ సమావేశంలో వాయు కాలుష్య సవాలును ఎదుర్కోవడానికి ఆచరణాత్మక, సాంకేతికత ఆధారిత పరిష్కారాలను అభివృద్ధి చేయడంపై చర్చించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. విధాన రూపకర్తలు, సాంకేతిక ఆవిష్కర్తల మధ్య అంతరాన్ని తగ్గించే లక్ష్యంతో అంకుర సంస్థలతో చర్చలు జరపడం ఒక నూతన చొరవ అని చెప్పారు. ఇటువంటి భాగస్వామ్యం విధానాల అమలులో మరింత ఏకరూపతను తీసుకురావడానికి, అలాగే.. పాలనలో పారదర్శకతను పెంచడానికి సహాయపడుతుందని భూపేంద్ర యాదవ్ వివరిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

====================

ప్రముఖ సినీ సంగీత దర్శకుడు దేవ ఈరోజు చెన్నైలో కన్నుమూశారు. 75 సంవత్సరాల దేవనేసన్ చొక్కలింగం.. తేనిసై తెండ్రల్ గా ప్రసిద్ధి చెందారు. తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ చిత్రాలకు 3 దశాబ్దాల పాటు సంగీత దర్శకుడిగా తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్న దేవా.. జానపద బాణీలకు సుప్రసిద్ధులు. 1980 - 1990 దశకంలో ఆయన విశేష ఖ్యాతిని గడించారు. రజనీకాంత్ నటించిన అన్నామలై, బాషా, అలాగే విజయ్ నటించిన ఖుషి చిత్రాలకు ఆయన అందించిన సంగీతం చిరస్థాయిగా నిలిచిపోయింది. దేవా మృతి పట్ల ఉపరాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. దేవా మరణం తమిళ చిత్ర, సంగీత పరిశ్రమకు తీరని లోటు అన్న ఉపరాష్ట్రపతి.. ఆయన కుటుంబ సభ్యులకు, బంధువులకు, స్నేహితులకు, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

====================

బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా భారత్ - వెస్టిండీస్ జట్ల మధ్య జరగాల్సిన ఐదో టీ-20 క్రికెట్ మ్యాచ్ వర్షం కారణంగా ఆలస్యమైంది. షెడ్యూల్ ప్రకారం సాయంత్రం 6 గంటల 30 నిమిషాలకు టాస్ వేయాల్సి ఉండగా వర్షం కారణంగా ఆలస్యమైంది. ఇప్పటికే రెండు జట్లు సిరీస్‌లో 2-2తో సమంగా ఉండటంతో ఈ మ్యాచ్‌లో ఏ జట్టు విజేతగా నిలిస్తే ఆ జట్టే సిరీస్‌ను కైవసం చేసుకుంటుంది.

====================

అమెరికాలోని లాస్ వేగాస్‌లో జరుగుతున్న అండర్-23 ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో, మహిళల 72 కిలోల విభాగంలో భారత్‌కు చెందిన అమృత పూజారి రజత పతకాన్ని గెలుచుకున్నారు. ఫైనల్ మ్యాచ్‌లో ఉక్రెయిన్‌కు చెందిన ఇరినా జబ్లోట్స్కా చేతిలో 0-6 తేడాతో ఓటమి చెందిన అమృత, ఈ పోటీలో రెండో స్థానంలో నిలిచారు. పరాగ్వేలోని అసన్సియోన్‌లో జరుగుతున్న `వరల్డ్ స్కేట్ గేమ్స్ 2026`లో, భారత్‌కు చెందిన 16 ఏళ్ల స్పీడ్ స్కేటర్ అనిరుధన్ వినోద్, జూనియర్ పురుషుల విభాగంలో స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నాడు. అదే ఈవెంట్‌లో భారత్‌కే చెందిన లోహనాథ్ అరుణ్ ప్రసాద్ రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు.

====================

రానున్న 24 గంటల్లో రోజుల్లో కోస్తాంధ్రప్రదేశ్, రాయలసీమ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. కోస్తాంధ్ర, రాయలసీమలలో ఈ నెల 19 నుండి 23 వరకు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. అలాగే.. ఈ నెల 23 వరకు తీర ప్రాంత కర్ణాటక, కేరళం, మాహే, లక్షద్వీప్, కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరి, కారైకాల్ లలో విస్తృతంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ శాస్త్రవేత్త తెలియజేస్తూ...

(వాయిస్ 23 సెకెన్లు)

====================

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సీనియర్ నాయకులు ఎల్.కె. అద్వానీ ఛాతీ ఇన్ఫెక్షన్‌తో న్యూఢిల్లీలోని అపోలో ఆసుపత్రిలో చేరారు. ప్రస్తుతం ఆయన ఐసీయూ (ICU)లో చికిత్స పొందుతున్నారు. సీనియర్ న్యూరాలజీ కన్సల్టెంట్ డాక్టర్ వినీత్ సూరి పర్యవేక్షణలో ఆయనకు చికిత్స అందుతోంది. అద్వానీ ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆయన వైద్యుల నిశిత పర్యవేక్షణలో ఉన్నారని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.

====================